sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 07-12-2025 ఆదివారం | సంపుటి-1 సంచిక : 258

EDITOR: ROHINI



ఆకాశంపై ఇండిగో ఆధిపత్యం

3 లక్షల మంది ప్రయాణాలు రద్దు

- పెళ్లిళ్లు కూడా వాయిదా పడిన దుస్థితి
- ఇదంతా యాజమాన్యం ఆడిన గేమ్
- దిక్కులు చూస్తున్న విమానయానశాఖ
- ఐదు రోజులుగా మౌనం దాల్చిన కేంద్రం
- చార్జీల డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు

దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది! డిసెంబరు ప్రారంభం నుంచే వేలాది విమానాలను రద్దు చేస్తూ అర్జెంటు పనులను... పెళ్లిళ్ల ప్రయాణాలనూ పూర్తిగా నాశనం చేసింది. ఈ వారంలో ఏకంగా 2,100కు పైగా విమానాలు రద్దయ్యాయి. దీంతో 3 లక్షల మంది ప్రయాణాలు నిలిచిపోయాయి. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై వంటి అనేక ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులు పడిగాపులు కాశారు. ముందుగా ప్లాన్ చేసుకున్నవన్నీ తలకిందులవడంతో ఎంతోమంది ఆందోళన చెందారు.

- సహనం వందే, హైదరాబాద్

దేశంలో గగనయానంపై ఇండిగో గుత్తాధిపత్యం ఏ స్థాయిలో ఉందో విమానాల రద్దే నిదర్శనం. ఎలాంటి కారణం లేకుండా లక్షలాదిమంది ప్రయాణికుల జీవితాలతో ఆ సంస్థ ఆటలాడుకుంది. ఇన్ని రోజులుగా ఇండిగో ఇష్టారాజ్యంగా వ్యవహరించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదు. ఇదంతా కేవలం పైలట్ల కొరత వల్లనో నిర్వహణా లోపం వల్లనో జరిగింది కాదట! ఈ సంక్షోభం యాదృచ్ఛికం కాదు... కావాలనే సృష్టించారని ఏకంగా ఇండిగో ఉద్యోగులే బహిరంగ లేఖలో ఆరోపించారు. పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) కొత్తగా తీసుకొచ్చిన పని గంటలు, విశ్రాంతి నియమాలను సడలించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే యాజమాన్యం వ్యూహాత్మకంగా సర్వీసులను రద్దు చేసిందనేది వారి ప్రధాన ఆరోపణ. అంటే ప్రయాణీకుల కష్టాలను పావుగా వాడుకుని కంపెనీ లాభాల కోసం ఇండిగో యాజమాన్యం ఈ డ్రామా ఆడింది.

కేంద్రం తీరు... కప్పిపుచ్చే ప్రయత్నం!

పెద్ద ఎత్తున రావడంతో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం శనివారం తూతూ మంత్రపు చర్యలకు దిగింది. తప్పంతా ఇండిగో యాజమాన్యానిదే అని... సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హెచ్చరించారు. అయితే ఒకపక్క దర్యాప్తు అంటూనే ఇంకోపక్క పైలట్ల విశ్రాంతి, నైట్ డ్యూటీల నిబంధనల్లో ఇండిగోకు తాత్కాలికంగా సడలింపులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. ఇది సంక్షోభానికి కారకులైన ఇండిగోకు వెసులు బాటు కల్పించడమే అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో ఏ ఒక్క ఎయిర్‌లైన్స్ కూడా ఇలాంటి జిమ్మిక్కులకు పాల్పడకుండా పౌర విమానయానశాఖ కఠిన నియమాలను రూపొందించాలి.

డాక్టర్ రఘురామ్‌కు అంతర్జాతీయ గౌరవం

రాయల్ కాలేజ్ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎన్నిక

- సాధించిన తొలి భారతీయ శస్త్రవైద్యుడు
- రొమ్ము క్యాన్సర్‌పై రఘురామ్ ముద్ర

దేశ వైద్య రంగానికి దక్కిన చారిత్రక గౌరవం ఇది. 425 ఏళ్ల చరిత్ర కలిగిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో గవర్నింగ్ కౌన్సిల్‌కు భారతదేశం నుంచి ఎన్నికైన తొలి శస్త్రవైద్యుడిగా డాక్టర్ రఘురామ్ ఘనత సాధించారు. కిమ్స్ - ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్‌గా ఆయన రొమ్ము క్యాన్సర్ నివారణ, చికిత్సలో అద్భుతమైన సేవలు అందించారు. డాక్టర్ రఘురామ్ ఇప్పుడు యునైటెడ్ కింగ్‌డమ్ బయట దేశాలకు ఈ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. యూకే రాయల్ కాలేజీల చరిత్రలోనే అత్యంత కఠినమైన ఎన్నికల్లో ఈ విజయం దక్కడం భారత వైద్య చరిత్రలో ఒక మైలురాయి. - సహనం వందే, హైదరాబాద్

గ్లాస్గో కౌన్సిల్‌లో యూకే బయటి దేశాల శస్త్ర చికిత్స వైద్యులకు కేవలం ఒకే ఒక్క సీటు ఉంది. ఆ ఒకే ఒక్క సీటు కోసం ప్రపంచం నలుమూలల నుంచి 26 మంది ప్రముఖ వైద్యులు పోటీ పడ్డారు. అత్యంత కఠినమైన పోటీ మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో డాక్టర్ రఘురామ్ ఏకైక విజేతగా నిలిచారు. 2025-2028 కాలానికి కౌన్సిల్ సభ్యుడిగా ఆయన కొనసాగుతారు. ఈ గౌరవాన్ని తన గురువులు, చికిత్స పొందిన, ప్రస్తుతం పొందుతున్న రొమ్ము క్యాన్సర్ బాధితులు, తన మాతృభూమికి అంకితం చేస్తున్నట్లు డాక్టర్ రఘురామ్ ప్రకటించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఇప్పటికే పద్మశ్రీ, డాక్టర్ బీసీ రాయ్ జాతీయ అవార్డు వంటి ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్న ఆయన... ఇప్పుడు ప్రపంచ స్థాయి వేదికపై భారతదేశ వైద్య రంగానికి కొత్త శకానికి నాంది పలికారు.

అయోధ్యలో మసీదు

రామాలయం పక్కనే నిర్మాణానికి రంగం సిద్ధం

- వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి శంకుస్థాపన
- సమీపంలో 5 ఎకరాల స్థలం కేటాయింపు
- ఇండియన్ ముస్లిం వక్ఫ్ ట్రస్ట్ వెల్లడి
- దేశంలో సంచలన రాజకీయ పరిణామం
- భారతీయ, ఇస్లామిక్ వాస్తుశిల్పంతో నిర్మాణం
- రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు
- అయోధ్యలో మత సామరస్య రాజకీయం!
- 33 ఏళ్ల మత రాజకీయ ఉద్రిక్తతకు ముగింపు?

అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత జరిగి సరిగ్గా 33 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1992 డిసెంబర్ 6న జరిగిన ఈ ఘటన దేశ రాజకీయాల్లో, మతపరమైన అంశాల్లో పెను ఉద్రిక్తతకు దారితీసింది. ఆ వివాదాస్పద స్థలంపై సుప్రీంకోర్టు తీర్పు మేరకు దివ్యమైన రామాలయ నిర్మాణం పూర్తయి ఇప్పుడు అక్కడ ప్రార్థనలు జరుగుతున్నాయి. సరిగ్గా అదే సమయంలో కోర్టు ఆదేశాల మేరకు కేటాయించిన స్థలంలో కొత్త మసీదు నిర్మాణం కూడా త్వరలో ప్రారంభం కానుంది. ఇది దేశ రాజకీయాల్లో సామరస్య స్థాపన అంశాన్ని తెరపైకి తెస్తోంది.

- సహనం వందే, అయోధ్య



అయోధ్యలో కొత్తగా నిర్మించబోయే మసీదు డిజైన్

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ముస్లిం సమాజానికి మసీదు నిర్మాణం కోసం అయోధ్య ప్రాంతంలోని ధన్నీపుర్ గ్రామంలో 5 ఎకరాల స్థలం కేటాయించారు. ఈ కొత్త మసీదు నిర్మాణానికి బాధ్యత వహించిన ఇండియన్ ముస్లిం వక్ఫ్ ట్రస్ట్ అధ్యక్షుడు జమీల్ అహ్మద్ వెల్లడించిన ప్రకారం... ఈ ప్రాజెక్టు పనులు 2026 ఏప్రిల్ నాటికి మొదలయ్యే అవకాశం ఉంది. ఈ మసీదు నిర్మాణానికి భారతీయ, ఇస్లామిక్ వాస్తు శిల్పాల మిశ్రమంతో నిర్మించాలని ట్రస్ట్ నిర్ణయించింది. మసీదుతో పాటు లైబ్రరీ, కమ్యూనిటీ సెంటర్లను కూడా నిర్మించనున్నారు. రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు అయోధ్యలోని రామాలయం పక్కనే సామరస్యం పేరుతో మరో రాజకీయ చర్చకు దారితీసే అవకాశం ఉంది.

సామరస్యం ట్రేడ్ మార్క్; ప్రధాని ట్వీట్!

బాబ్రీ మసీదు కూల్చివేత రోజు సందర్భంగా దేశవ్యాప్తంగా శాంతి సమావేశాలు నిర్వహించడం ఈసారి రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం ట్విట్టర్ వేదికగా స్పందించడం గమనార్హం. 'భారతదేశం సామరస్యం... శాంతి దేశం' అని ప్రధాని ట్వీట్ చేశారు. ఈ కొత్త మసీదు ప్రాజెక్టు మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు జమీల్ అహ్మద్ చెబుతున్నారు. ఒకవైపు హిందూ యాత్రోత్సవాలకు కేంద్రంగా మారిన అయోధ్యలో మరోవైపు మసీదు నిర్మాణం చేపట్టడం అనేది భారతీయ భిన్నత్వంలో ఏకత్వానికి, రాజ్యాంగపరమైన లౌకికత్వానికి కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యతగా రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది దేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా మారుతుందని అంటున్నారు.

కవిత

చినుకుల తడి
చిగురిస్తున్న సవ్వడి
కవ్వించే మేఘాలు
జలవారుతున్న మబ్బులు
నీకై చూస్తూ... వడి వడిగా
పరిగెడుతున్నాయి
రారమ్మని పిలుస్తున్నాయి...
ఆహ్వానం పంపుతున్నాయి..

తొలి వెలకువతోనే..
గర్జించే మేఘాలు
గాండ్రించే ఉరుములు..
నేనున్నా అంటూ మెరుపులు
సందడి చేసున్నాయి...
సాదర స్వాగతం అంటూ
నిన్ను మేల్కొలపుతున్నాయి..
ఆహ్వానం పంపుతున్నాయి..

(శ్రీలత)